# 54

# నాయకత్వమునకు ఆయన ఇచ్చిన హెచ్చరిక

## (23:1-12)

మత్తయి సువార్తలోని తరువాతి మూడు అధ్యాయములు, 23 మొదలుకొని 25 వరకు, ఐదవది మరియు చిట్టచివరిదియునైన బోధనము గల విభాగమై యున్నది. సువార్తలోని ప్రాముఖ్యమైన ఈ విభాగము విశిష్టమైన సూక్తి పలుకులతో: "యేసు ఈ మాటలన్నియు చెప్పి చాలించిన తరువాత" (26:1; చూడు 7:28; 11:1; 13:53; 19:1) ముగియుచున్నది. ఈ విభాగములో ప్రభువు యొక్క గ్రంథస్థం చేయబడిన చివరి బహిరంగ ప్రసంగము (23వ అధ్యాయం) మరియు ఆయన తన శిష్యులతో మాటలాడిన ఒక ఏకాంత సంభాషణ (24 మరియు 25 అధ్యాయాలు) కలవు. రెండు ఉపన్యాసములు కలిపి యెరూషలేము నాశనము మరియు అంతిమ తీర్పు గూర్చిన ప్రస్తావనల చేత అల్లబడియున్నవి.

22వ అధ్యాయం, "ఎవడును మారుమాట చెప్పలేకపోయెను. మరియు ఆ దినము నుండి ఎవడును ఆయనను ఒక ప్రశ్నయు అడుగ తెగింపలేదు" అను సారాంశముతో ముగియుచున్నది (22:46). ఈ ప్రకటన యూదుల నాయకుల విషయంలో చేయబడినదని స్పష్టమగుచున్నది. నాయకులైనవారు ఆయనతో మాటలాడ తెగింపనందు వలన, ఆయన కూడుకొని యుండిన జనసమూహమునకు మరియు తన శిష్యులకు బోధించుచుండెను (23:1). ఆయన మాటలాడాలనుకొంటే ఎన్నో విషయాల గూర్చి మాటలాడవచ్చును; కానీ అప్పటి వరకు ఆయన చవిచూచిన అనుభవముల దృష్ట్యా, యూదా నాయకులు, శాస్త్రులు మరియు పరిసయ్యుల ఉపదేశములు మరియు ప్రవర్తన గూర్చి సంబోధించుటకు ఆయన ఎన్నుకొన్నాడు. ఆర్. టి. ఫ్రాన్స్ గమనించుచున్నట్లుగా, అచ్చట చేరియుండిన తన శ్రోతలు పరిసయ్యులకు సంబంధించిన కర్మ ప్రధాన సిద్ధాంతము నుండి తెగదెంపులు చేసికొనునట్లు సవాలు చేయుటకు ఆ నాయకులను బహిరంగముగా బయటపెట్టవలెననునది యేసు ఉద్దేశమై యుండినది.[1]

యేసు సందేశము మూడు భాగములుగా విభజింపబడినది. మొదటిది, శాస్త్రులు మరియు పరిసయ్యులు మోషే ధర్మశాస్త్రమును సరిగా ఉపదేశించినంత వరకు, ప్రజలు వీరి ఉపదేశములను అనుసరించవలెనని ఆయన ప్రజలను విన్నవించాడు (23:1–12); కానీ ఈ నాయకుల నడవడిని మరియు ప్రవర్తనను అనుకరించకూడదని ఆయన వారిని హెచ్చరించాడు. వారు వేషధారులై యుండిరి ఏలయనగా తాము చెప్పుచుండిన విషయములను వారు చేయలేదు. ఇది ఏ యే విధములుగా నిజమై యున్నదో యేసు వారికి వర్ణించాడు. రెండవదిగా, వేషధారణతో కూడిన వారి నడవడికనుబట్టి ఆయన వారి మీదకు ఏడు శ్రమలను ప్రకటించాడు (23:13–36). మూడవది, యెరూషలేము ప్రజలు ఆయనను తృణీకరించినందునుబట్టియు, వారి మీదికి రానై యుండిన భవిష్యత్ ముప్పును చూచుటకు

ఆయన తాళలేకపోయినందునుబట్టియు ఆయన ఆ పట్టణము గూర్చి విలపించాడు (23:37-39). క్రీ.శ. 70లో, రోమనులు ఈ పట్టణమును నాశనము చేసారు.

## తాము లోబడకుండానే ఇతరులు లోబడవలెనని సాధికారంతో కోరుట (23:1-4)

**[1]అప్పుడు యేసు జనసమూహములతోను తన శిష్యుల తోను ఇట్లనెను [2]-శాస్త్రులును పరిసయ్యులును మోషే పీఠమందు కూర్చుండువారు [3]గనుక - వారు మీతో చెప్పువాటినన్నిటిని అనుసరించి గైకొనుడి, అయినను వారి క్రియలచొప్పున చేయకుడి; వారు చెప్పుదురే గాని చేయరు. [4]మోయ శక్యముకాని భారమైన బరువులు కట్టి మనుష్యుల భుజములమీద వారు పెట్టుదురేగాని తమ వ్రేలితోనైన వాటిని కదలింపనొల్లరు.**

**వచనము 1. యేసు** ఈ సంభాషణోపన్యాసమును దేవాలయములో ఉన్నప్పుడు **జనసమూహములతోను తన శిష్యులతోను** చేసాడు. స్పష్టముగా, అది యింకా క్రీస్తు శ్రమల వారములోని మంగళవారమే. లూకా వ్రాసిన సువార్తలో, యేసు ఒక పరిసయ్యుని ఇంట భోజనము చేయుచుండిన సందర్భములో, ఆయన పలికిన ఇటువంటి పలుకులే గ్రంథస్థం చేయబడి యున్నవి (లూకా 11:37-52). యేసు అప్పుడప్పుడు, ఆయన ఉపదేశములను వినుచుండిన వారి అవసరములకు అది సరిపడునదై యుండునట్లు ఆయన సందేశములో కొద్దిగొప్ప మార్పులు చేయుచు, అదివరకు పలుకులనే ఆయన పలుకుచుండెను.

**వచనము 2.** యూదా నాయకుల, అనగా సమీపించి యుండిన దేవుని రాజ్యము నిమిత్తమైన సిద్ధపాటుగా ప్రజలు మారుమనస్సు నొందునట్లు వారిని నడిపించవలసియుండిన వారి వేషధారణను, యేసు బహిరంగము చేసాడు. వీరు దేవుని ప్రవక్తను (బాప్తిస్మమిచ్చు యోహానును) మరియు ఆయన మెస్సీయాను (యేసును) తృణీకరించారు. తత్ఫలితంగా, వారి వ్యతిరేకార్థక ప్రభావము. అనేకులు దేవుని చిత్తమును నిరాకరించుటకు హేతువయ్యింది.

**శాస్త్రులు,** ప్రాథమికంగా చట్టమునకు సంబంధించిన దస్తావేజుల బాధ్యతగల ప్రభుత్వ అధికారులై యుండిరి (1 దినవృత్తాంతములు 24:6). దేశబహిష్కరణకు (చెరగా కొనిపోబడిన కాలమునకు) ముందటి కాలములో ఈ పదము మతపరంగా అన్వయింపబడలేదు. ఏది ఏమైనా, దేశబహిష్కరణ కాలములో ఒక ప్రత్యేక వర్గమునకు చెందిన శాస్త్రులు బయల్దేరారు. వీరు మోషే ధర్మశాస్త్రమును అనువదించుటకును బోధించుటకును బాధ్యతగల బద్ధులై యుండిరి. ఎజ్రా ఈ కోవకు చెందినవాడే (ఎజ్రా 7:6, 11, 12; నెహెమ్యా 8:1, 4, 9, 13; 12:26, 36). చేతితో ప్రతినకలు వ్రాయుచుండిన సమయంలో, లేఖనములతో చాలినంత సమయము గడుపుట ద్వారా శాస్త్రులు ధర్మశాస్త్రమును గూర్చిన మంచి తెలివి సంపాదించుకొన్నారు (2:4పై గల వ్యాఖ్యానము చూడు).

**పరిసయ్యులు** సరిగ్గా ఏ కాలములో బయల్దేరారో ఖచ్చితంగా తెలియదు, కానీ ఈ వర్గమువారు అంతియొకయ ఎపిఫనేస్, సిరియా దేశ నిరంకుశ పరిపాలకుడైనవాని కాలములో, క్రీ.పూ. రెండవ శతాబ్దములో యూదా మతమును నిర్మూలించుటకు ప్రయత్నించిన వాని కాలములో, దారుణమైన కృత్యములు సంభవించుచుండిన సమయంలో, తలెత్తినట్లు తెలియుచున్నది. ఈ రాజు ఇశ్రాయేలీయుల నందరిని,

ముఖ్యముగా యూదా మతమునకు ప్రధాన కేంద్రమై యుండిన యెరూషలేము వాస్తవ్యులను, హెల్లేనీయులుగా మార్చుటకు ప్రయత్నించాడు.[2] అంతియొకయ సైన్యములు ఎట్టకేలకు మక్కాబీయుల తిరుగుబాటు మూలమున పారదోలబడినవి. యూదా మక్కాబీ, "సుత్తె" అని పేరుగాంచినవాని ("మక్కాబీ" అనగా, "సుత్తె" అని అర్థము) నాయకత్వములో, యెరూషలేము పట్టణము పునఃకైవశము గావించుకొనబడినది, అప్పుడు దేవాలయము శుద్ధీకరింపబడినది.[3] ఆసక్తికరమైన సంఘటనలు సంభవించుచుండిన ఈ సమయంలో, పరిసయ్యులు తమ్మును తాము ఇతర యూదుల నుండి వేరుచేసుకొన్నారు. ధర్మశాస్త్రమును పొల్లైనను విడిచిపెట్టకుండ పాటించుటకు వారు ప్రయత్నించినప్పటికిని, వారు ఎన్నడును ఒక పెద్ద గుంపుగా ఎదుగలేదు. ఏది ఏమైనా, కొలది కాలములోనే వారు ప్రజల్లో అత్యంత పలుకుబడిగలవారయ్యారు (3:7పై గల వ్యాఖ్యానము చూడు).

శాస్త్రులు పరిసయ్యుల నుండి వేరుచేయుట కష్టము, ఏలయనగా శాస్త్రులలో అధిక సంఖ్యాకులు పరిసయ్యులై యుండిరి. యేసు తరచుగా, ఈ సందర్భములో వలెనే, వారిని కలిపి సంబోధించుచుండెను (5:20; 12:38; 15:1). 23వ అధ్యాయంలో ఇవ్వబడిన అనేక ఖండనల వలన, మనము తరచుగా శాస్త్రులు మరియు పరిసయ్యులు చెడ్డవారని ముద్రవేయుదుము. ఏది ఏమైనా, తమ్మును తాము దేవునికే అంకితము చేసికొనిన కొందరు యేసు మరియు ఆయన బోధల యెడల బాహాటమైన హృదయము కలిగియుండిరి (మార్కు 12:32-34; లూకా 7:36; 13:31; యోహాను 3:1, 2; అపొస్తలుల కార్యములు 15:5). అట్లయినప్పటికిని, వారిలో ఎక్కువ మంది మొండివారును, వేషధారులైన న్యాయబద్ధీకరణవాదులునై యుండిరని యేసు బట్టబయలు చేసాడు.

అటుతరువాతి యూదా మతోపదేశకుల రచనలు కూడ పరిసయ్యులు వేషధరణ పట్ల చూపిన ఉన్ముఖతను సూచించినవి. యెరూషలేము టాల్ముడ్ పరిసయ్యులను ఏడు వర్గములుగా వర్గీకరించినది:

1. "భుజబల పరిసయ్యుడు" - అందరు చూచునట్లు, తాను చేపట్టిన మత సంబంధమైన కార్యముల జాబితాను తన భుజముపై మోసికొని వెళ్లుచుండువాడు.
2. "కొంచెము సేపు వేచియుండుమని చెప్పు పరిసయ్యుడు" - "నేను వెళ్లి మత సంబంధమైన ఒక మంచి పని చేసేంత వరకు ఒక్క నిమిషము వేచియుండుము" అని చెప్పేవాడు.
3. "పద్దులు రాసిపెట్టే పరిసయ్యుడు" - అతడు చేయవలసివచ్చునది ఒక పని, మరియు మత విధిగా చేయాల్సినది మరొక పని చేస్తాడు, ఈ రెండూ కూడ సమతుల్యముగా నుండునట్లు చూచుకొంటాడు.
4. "లోభిత్వంగల పరిసయ్యుడు" - "నేనొక మత సంబంధమైన మంచి పని చేయునట్లు, నేను పొదుపుచేయుట నాకు చూపించేవాడు."
5. "నేను చేసిన తప్పును నాకు చూపించుమని చెప్పే పరిసయ్యుడు" - "నేను చేసిన పాపమేమిటో నాకు చూపండి, అప్పుడు నేను దానికి సమానంగా సరిపడు మతసంబంధమైన సత్కార్యములను చేస్తాను" అని చెప్పేవాడు.
6. "భయమునుబట్టి పరిసయ్యుడైనవాడు" - అనగా, దేవునికి భయపడువాడు.
7. "ప్రేమనుబట్టి పరిసయ్యుడైనవాడు" - అనగా, దేవుని ప్రేమించువాడు.[4]

శాస్త్రులు మరియు పరిసయ్యులు **మోషే పీఠమందు** [*kathedra*] **కూర్చుండువారు.**

యూదుల మతోపదేశకులు వారు ఉపదేశించుచుండిన సందర్భములలో సాంప్రదాయికంగా కూర్చుండు వారు (చూడు 5:1; 13:2; 24:3; 26:55; లూకా 4:20). కొన్ని సమాజమందిరములలో అక్షరాలా "మోషే పీఠము" అని పిలువబడిన ఒక పీఠముండినది. ఇటువంటి పీఠములు, చలవరాయితోగాని లేదా రాతితోగాని చేయబడినవి, నానా విధ స్థలములలో కనుగొనబడినవి: డెలోస్ గ్రీకు ద్వీపము, సిరియా దేశములోని డ్యూర యూరోపాస్, మరియు హమ్మత్ తిబెరియ, కొరాజీనా, మరియు ఇశ్రాయేలులోని ఏన్ గెదీ.[5] మర్యాద ఇవ్వబడుచుండిన యూదా మతోపదేశకులు, కూడుకొని యుండు జనసమూహములకు తమ ఉపదేశముల నందించునప్పుడు మోషే పీఠములో అనగా, మతాధికార పీఠముగా గుర్తింపబడిన దానిపై కూర్చుందురు. ఇటువంటి నియామకమునకు పాత నిబంధనలో బైబిల్ సంబంధమైన ఎటువంటి ఆదేశమైనను ఇవ్వబడలేదు. అది యూదులు తమంతటతామే సృష్టించుకొనిన హోదాగల ఒక స్థానమై యుండినది. ఏది ఏమైనా, యూదులు బోధించిన ఏ ఉపదేశమైనను దేవుని వాక్యమునకు అనుగుణముగా ఉన్నంత వరకు, యేసు దానిని గుర్తించాడు మరియు దానికి మర్యాద ఇచ్చాడు.

**వచనము 3.** శాస్త్రులు మరియు పరిసయ్యులు బోధించుచుండు విషయములను ఆలకించవలెననియు, **వారు చెప్పువాటినన్నిటిని అనుసరించి గైకొనవలెను, అయినను వారి క్రియల చొప్పున చేయకూడదనియు** యేసు కూడికొనియుండిన జనసమూహములతోను తన శిష్యులతోను చెప్పాడు. యేసు పరిసయ్యుల బోధలను తరచుగా వ్యతిరేకించాడు (5:17–48; 12:1–8; 15:1–20; 16:5–12; 19:1–12). కాబట్టివారు చెప్పువాటినన్నిటిని అనుసరించి గైకొనవలెనని ఆయన చెప్పాడంటే, వారి ఆదేశములు మోషే ధర్మశాస్త్రమునకు పొంతనగా ఉన్నవో లేవో పరిశీలనగా చూచుకొనుచు వాటికి లోబడవలెనని ఆయన భావించాడు.

**వారు చెప్పుదురే గానిచేయరు** అని ఆయన సెలవిచ్చినప్పుడు యేసు, "వేషధారుడు" అను పదమునకు ఉత్తమమైన నిర్వచనమునిచ్చాడు. "వారు చెప్పేదానిని అభ్యసించరు" అని NIVలో వ్రాయబడి యున్నది. ఇదే ఇతివృత్తమును మనస్సులో ఉంచుకొని, పౌలు ఇలా వ్రాసాడు,

> నీవు యూదుడవని పేరు పెట్టుకొని ధర్మశాస్త్రమును ఆశ్రయించి దేవునియందు అతిశయించుచున్నావు కావా? ఆయన చిత్తమెరిగి ధర్మశాస్త్రమందు ఉపదేశము పొందిన వాడవై శ్రేష్ఠమైనవాటిని మెచ్చుకొనుచున్నావు కావా? జ్ఞానసత్యస్వరూపమైన ధర్మశాస్త్రము గలవాడవైయుండి –నేను గ్రుడ్డివారికి త్రోవచూపువాడను, చీకటిలో ఉండువారికి వెలుగును, బుద్ధిహీనులకు శిక్షకుడను, బాలురకు ఉపాధ్యాయుడనై యున్నానని నీయంతట నీవే ధైర్యము వహించుకొనుచున్నావు కావా? ఎదుటివానికి బోధించు నీవు నీకు నీవే బోధించుకొనవా? దొంగిలవద్దని ప్రకటించు నీవు దొంగిలెదవా? వ్యభిచరింపవద్దని చెప్పు నీవు వ్యభిచరించెదవా? విగ్రహములను అసహ్యించుకొను నీవు గుళ్లను దోచెదవా? ధర్మశాస్త్రమందు అతిశయించు నీవు ధర్మశాస్త్రము మీరుటవలన దేవుని అవమానపరచెదవా? రోమీయులకు (2:17–23).

**వచనము 4.** యేసు, శాస్త్రులు మరియు పరిసయ్యుల వేషధారణ గూర్చి అనేక సోదాహరణముతో కూడిన చిత్రీకరణములను సమకూర్చాడు. మొదటిదిగా,

**మోయశక్యముకాని భారమైన బరువులు**[6] **కట్టి మనుష్యుల భుజముల మీద వారు పెట్టుదురే గాని తమ వ్రేలితోనైన వాటిని కదలింపనొల్లరు** ఈ మనోకల్పన యొక్క నేపథ్యము ఆ రోజుల్లోని సామాన్య జన జీవితములో నుండి తీసికొనబడినది. లియోన్ మోర్రిస్ దీనిని ఇలా వర్ణించాడు:

> *మోయశక్యముకాని భారమైన బరువులు* కట్టుట, జంతువులు లేదా బానిసలు మోయవలసి యుండు బరువులను సిద్ధము చేయుటను సూచించుచున్నది; ఈ బరువుల మూటలు తీసికొనిపోబడక మునుపు అవి మార్గము మధ్యలో విడిపోకుండునట్లు వాటిని బహు భద్రముగా కట్టవలసి యుండినది. కానీ ఈ పని అజాగ్రత్తతో కూడ చేయబడవచ్చును, అట్టి సందర్భములో బరువులు బహు భారమైనవిగాను సంభాళించుటకు వీలుకానివిగాను ఉండవచ్చును – అప్పుడు వాటిని మోయశక్యము కాదు మరియు అవి బహు భారమైనవై యుండును.[7]

"మోయశక్యముకాని భారమైన బరువులు," ఈ శాస్త్రులు మరియు పరిసయ్యులు మోషే ధర్మశాస్త్రమునకు అదనంగా చేర్చిన అనేక నియమములు, నిబంధనలు, నిర్బంధములునై యుండినవి. ఈ మౌఖిక నియమము, దాని మూలాధారము దైవికమైనదై యున్నదని అనేక మంది యూదులు నమ్మిన నియమము, ధర్మశాస్త్రమును మించి ఎంతో భారమైనదై యుండినది (చూడు అపొస్తలుల కార్యములు 15:10). ఉదా॥ "విశ్రాంతి దినమును పరిశుద్ధముగా ఆచరించుటకు జ్ఞాపకముంచుకొనుము" అను సామాన్య నియమము (నిర్గమకాండము 20:8) ఎలా ఒక భారమైన బరువుగా చేయబడగలదో గమనించుట, అది చెప్పుకోదగిన విషయమై యున్నది.[8] ఏడవ దినమునాటి విశ్రాంతి విధానమును క్రమబద్ధీకరణము చేయుటకు యూదుల మతోపదేశకులు ఎన్నో నియమములు కల్పించారు. యేసు మరియు ఆయన శిష్యులు సబ్బాతు దినాచారమును ఉల్లంఘించారని విమర్శింపబడినప్పుడు, వారి విమర్శకులు దేవుని నియమమును ప్రస్తావించుచుండలేదు, కానీ శతాబ్ధాలుగా మానవులు కల్పించిన సాంప్రదాయములను సూచించుచుండిరి (చూడు 12:1–8; యోహాను 5:5–13). ఈ నియమ నిబంధనలలో ఏ ఒక్క దానిని ఉల్లఘించినను, ప్రజలు దండింపబడుచుండిరి, అట్లయినను ఈ న్యాయబద్ధీకరణవాదులు ఆ యా భారములను ఒక వ్రేలితొనైనను కదలించరు. ఇతరులకు చెప్పుచుండిన విషయములను వారే చేయుట కంటె, ఇతరులు ఏమి చేయవలెనో వారికి చెప్పుటలో వారు ఎంతో ఆరితేరినవారై యుండిరి.

కట్టుట మరియు విప్పుట యను ఆలోచన గూర్చి మనము మత్తయి వ్రాసిన సువార్తలో ఇంతకు మునుపు పేతురు మరియు ఇతర అపొస్తలుల ప్రస్తావన వచ్చిన సందర్భములో చర్చించాము (16:19; 18:18పై గల వ్యాఖ్యానము చూడు). గొప్ప తారతమ్యమేమనగా, అపొస్తలులు విధించిన నియమములు పరిశుద్ధాత్మ చేత ప్రేరేపింపబడినవై యుండగా, పరిసయ్యులు విధించినవి మానవ కల్పితములై యుండినవి. యూదుల నాయకులకును యేసునకును మధ్య గల కేవలమైన వ్యత్యాసము స్పష్టముగా అగుపించును. వారి భారములు మోయశక్యముకానివై యుండెను, కానీ యేసు, "నా కాడి సుళువుగాను నా భారము తేలికగాను ఉన్నవి" అని సెలవిచ్చాడు (మత్తయి 11:30).

## ఇతరులను ప్రభావితము చేయుటకు మన నీతిని ప్రదర్శించుట (23:5-12)

**[5]మనుష్యులకు కనబడునిమిత్తము తమ పనులన్నియు చేయుదురు; తమ రక్షరేకులు వెడల్పుగాను తమ చెంగులు పెద్దవిగాను చేయుదురు; [6]విందులలో అగ్రస్థానములను సమాజమందిరములో అగ్రపీఠములను. [7]సంత వీధులలో వందనములను మనుష్యులచేత బోధకులని పిలువబడుటయు కోరుదురు. [8]మీరైతే బోధకులని పిలువబడవద్దు, ఒక్కడే మీ బోధకుడు, మీరందరు సహోదరులు. [9]మరియు భూమిమీద ఎవనికైనను తండ్రి అని పేరు పెట్టవద్దు; ఒక్కడే మీ తండ్రి; ఆయన పరలోకమందున్నాడు. [10]మరియు మీరు గురువులని పిలువబడవద్దు; క్రీస్తు ఒక్కడే మీ గురువు. [11]మీలో అందరికంటె గొప్పవాడు మీకు పరిచారకుడై యుండవలెను. [12]తన్ను తాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడును; తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును.**

**వచనము 5**. కొండ మీద చేసిన ప్రసంగములో, పరిసయ్యుల స్వయంప్రోత్సాహకముల గూర్చినవి యేసు మూడు ఉదాహరణములను చెప్పాడు: ఇచ్చుట, ప్రార్థించుట, మరియు ఉపవాసముండుట (6:1-18). **మనుష్యులకు కనబడు నిమిత్తము వారి పనులన్నిటిని చేయు వారి** గూర్చి ఆయన ఇచ్చుట చెప్పుచున్నాడు.

**వారు తమ రక్ష రేకులు వెడల్పుగాను, తమ చెంగులు పెద్దవిగాను చేయుదురు.** "రక్ష రేకులు" లేఖనములను కలిగియుండిన చిన్న తోలు పెట్టెలై యుండినవి, యూదులు వాటిని తమ నొసళ్ల మీదను, ఎడమ చేతుల మీదను ధరించుచుండిరి. ఖుమ్రాన్‌లోని గుహ నెం. 1లో కనుగొనబడినవి, ఏమాత్రమును చెరగని రెండు రక్ష రేకులు మరియు ఇతర రక్ష రేకులలో ఉండిన ముక్కల గూర్చి మైఖేల్ జే. విల్కిన్స్ వర్ణించాడు. ఒక రకమైనది షుమారు ఒక అంగుళము పొడవుండినది, చిన్న కాగితపు చుట్టలను వాటిలో ఉంచుటకు దానిలో నాలుగు విడి విడి భాగములుండినవి. వీటిపై వరుసగా, నిర్గమకాండము 13:9, 16; ద్వితీయోపదేశకాండము 6:8; 11:18 లిఖింపబడి యున్నవి. ఈ రకమైన రక్ష రేకులు నొసళ్లపై ధరింపబడినవి. మరొక రకమైన రక్ష రేకులు అంగుళములో 1/3 భాగముండినవి, ఒకే ఒక్క భాగముండినది. చిన్న లిపితో నాలుగు వచనములు లిఖింపబడి యుండిన ఒక చిన్న కాగితపు చుట్ట దానిలో ఉండినది, ఇది ఎడమ చేతి మీద ధరించబడినది.[9]

"రక్ష రేకులు" (*phulaktērion*) అను పదజాలము "కాపాడు" లేక "తాయెత్తు" అను అర్థమిచ్చుచున్నది. ఈ చిన్న చిన్న పెట్టెలకు సంబందించిన యింకా రెండు పదములు *tefillin*, అనగా "ప్రార్థనలు" అనియు, "బాసికములు" అని ద్వితీయోపదేశకాండము 6:8 మరియు 11:18లో అనువదింపబడిన *totaphoth* కూడ కలవు. దేవుని నియమములను వారి చేతులకు కట్టుకొనవలెననియు, వారి నొసళ్ల మీద ధరించుకొనవలెననియు లేఖనములలో ఆజ్ఞాపింపడిన విషయమును యూదా మతోపదేశకులు అక్షరార్థముగా అనువదించుటవలన వీటిని ధరించు వాడుక మొదలయ్యింది.[10] ఇవి వాస్తవమునకు, దేవుని వాక్యము ఎల్లప్పుడు అయన ప్రజల యెదుట – వారి హృదయంలోను, వారి మనస్సులోను – ఉండవలెనని లేఖనములు సెలవిచ్చిన దానికి సంకేతాత్మకమైన ప్రకటనలై యుండినవి. ఈ రక్ష రేకులను పెద్దవిగా చేసికొనుట ద్వారా, వారికి దేవుని యెడల ఎంతో గొప్ప భయభక్తులు కలవని కొందరు యూదులు భావించుచుండిరి. నేడు కూడ, సనాతన సాంప్రదాయ భావలున్న

యూదులు ఉదయకాల ప్రార్థనల సమయంలోను, ఇతర సందర్భాల్లోను, చిన్న తోలు పెట్టెలను వారి నొసళ్లపైనను వారి చేతుల మీదను ధరించుదురు.

వారు దేవుని అజ్ఞలకు లోబడుచు తమ్మును తాము పరిశుద్ధులుగా ఉంచుకొనవలసి యున్నదని యూదులకు గుర్తుచేయుటకు "చెంగులు" ధరింపబడినవి. ఈ "చెంగులు," లేక "అంచులు" (NRSV) దేవుని ఆదేశముల మేరకు (సంఖ్యాకాండము 15:38-40; ద్వితీయోపదేశకాండము 22:12) ఒక ఉడుపు యొక్క అంచుకుట్టు మూలల్లో ధరింపబడినవి. యేసు కూడ వీటిని ధరించాడు (9:20; 14:36). ఏది ఏమైనా, వేషధారులై యుండిన పరిసయ్యులు, ఈ చెంగులను దేవుని నియమములను గుర్తుచేసికొనుట ధరించలేదు; దానికి మారుగా, తమ్మును గూర్చిన సావధానమునకు ప్రాముఖ్యత నిచ్చుకొనుటకును, వారికున్న భక్తి గూర్చి ఇతరులకు గుర్తుచేయవలెననియే వారు ధరించారు. ఈ చెంగులు ఎంత పొడవైనవిగా ఉంటే, వాటిని ధరించినవాడు అంత భక్తిపరుడని పరిగణింపబడుచుండినది. నేటి క్రైస్తవ నాయకుల కొందరి వేషభాషలు మరియు వస్త్రధారణ కూడ ఇలాగే ఉన్నది, ఆ నాటి పరిసయ్యుల వస్త్రధారణకు తక్కువైనదేమీ కాదు.

**వచనము 6.** ఇంకా, **వారు విందులలో అగ్రస్థానములను సమాజమందిరములలో అగ్రపీఠములను కోరుదురని** కూడా చెప్పాడు యేసు. విందులకు హాజరగు అతిథులు సమాజములో వాటికి గల ప్రాముఖ్యతను అనుసరించుచు, వారు అవరోహణ క్రమములో కూర్చుండుట, అదొక వాడుకయై యుండినది.[11] అతిథేయికి అత్యంత సమీపముగా నుండిన స్థానములు అత్యధికంగా గౌరవింపబడినవని ఎంచబడినవి. మరొక సందర్భములో, అత్యధికంగా గౌరవింపబడు ఆస్థానములే కావాలని ఆశించుటలో గల అపాయము గూర్చి హెచ్చరించుటకు యేసు ఒక ఉపమానము చెప్పాడు. విందులో ఒకడు అగ్రపీఠమునే ఎన్నుకొని కూర్చున్నప్పుడు అతని కంటె ముఖ్యమైన మరొక అతిథి వచ్చి అతని స్థానములో కూర్చుండునట్లు అతడు లేవవలెనని కోరబడినట్లయితే, అతనికిది ఎంతో అవమానకరమైన పరిస్థితి యగును. ఇలా కాకుండా, తక్కువ స్థాయిలో గల చోటు నుంచి ఉన్నతమైన స్థాయిలో గల చోట కూర్చుండవలసినదని కోరబడినప్పుడు, అది అతనికి అత్యంత గౌరవనీయమైన పరిస్థితి యగును (లూకా 14:7-11). తమ్మును తాము హెచ్చించుకొనువారు, తగ్గింపబడుదురు, తమ్మును తాము తగ్గించుకొనువారు హెచ్చింపబడుదురు (23:11, 12). యాకోబు మరియు యోహాను గౌరవనీయమైన స్థానముల కొరకు, యేసు కుడిచేతి వైపున ఒకడు మరియు ఎడమ చేతివైపున మరొకడు కూర్చుండునట్లు సెలవిమ్మని ఎంతో ఆశతో అడిగారు, కానీ వారి స్వప్రయోజనార్థమైన మనవినిబట్టి యేసు వారిని గద్దించాడు (20:20-23).

ప్రాచీన సమాజమందిరములలో నేల మట్టమునకు కొంచెము ఎత్తుగా, ఒక భవంతి ముందటి భాగంలోగాని లేదా దాని మధ్యలోగాని కట్టబడిన వేదికలుండినవి. ఒక వేదిక (*bēma*)పై ఒక బల్ల ఏర్పాటు చేయబడి లేఖన భాగములు చదువబడు నిమిత్తము దాని మీద కాగితము చుట్టలు (లూకా 4:16, 17), మోషే పీఠము (23:2), మరియు ఇచ్చట పేర్కొనబడిన "అగ్ర పీఠములు" ఉంచబడును. ఈ పీఠములపై ఆరాధనలో పాల్గొనువారు మరియు ప్రజల్లో ప్రసిద్ధిగాంచినవారు ఆసీనులౌదురు. విశేషముగా, తక్కువ స్థాయిలో నున్న పీఠములు సమాజమందిర గోడల వెంబడి సమాజమందిర సభ్యుల నిమిత్తమై ఏర్పాటు

చేయబడినవి.[12] అందరు చూచునట్లు ముఖ్యమైన ఆసనములను ఆక్రమించుకొని అందరి సావధానమును ఆకర్షించుచు ఆనందానుభూతి చెందవలెనను వారి ప్రేరణకారములను యేసు ఖండించాడు.

**వచనము 7.** శాస్త్రులు మరియు పరిసయ్యులు **సంత వీధులలో వందనములను, మనుష్యుల చేత బోధకులని పిలువబడుటను** కూడ ప్రేమించారు. ఇచ్చట, ఆశింపబడుచున్న పూజనీయత ఖండింపబడుచున్నది. "సంత వీధులు" – సామాన్య ప్రజానీకము కూడుకొనుచుండిన సామాజిక స్థలములై యుండినవి, గనుక ఈ మతోపదేశకులైన నాయకులు ఆ యా స్థలాల్లో అందరు వారికి బహిరంగముగా వందనములు చేసినప్పుడు ఉప్పొంగిపోవుచు బహుగా ఆనందించారు. మామూలు అభివందనముల కంటె ఇచ్చట అతిగా హెచ్చింపబడిన అభివందనములు ఆశింపబడినవి.

"బోధకుడు" అనగా, "నా ప్రభువు" లేక "నా యజమానుడు" అని అర్థము, మరియు మిక్కిలి విశిష్టమైన ధర్మశాస్త్రోపదేశకుడని ఎంచబడిన వానికి అదొక గౌరవార్థకమైన బిరుదై యుండినది. యేసు మరియు బాప్తిస్మమిచ్చు యోహాను – ఈ ఇరువురు కూడ "బోధకుడు" అను బిరుదుతో సంబోధించబడిరి (మార్కు 9:5; 11:21; యోహాను 1:38, 49; 3:2, 26). జాక్ పి. లూయిస్ ఈ పదమునకు గల చరిత్రను గుర్తుచేయుచున్నాడు:

> రబ్బీ ("నా ఉపదేశకుడు") అను పదము అప్పుడే మొదటి శతాబ్దములో ఒక గౌరవార్థకమైన బిరుదుగా వాడుకలోనికి వచ్చుచుండినది. యూదా మత బోధకుల సాంప్రదాయములో గమలీయేలు మొట్టమొదటి ఉపదేశకుడై యుండెను గనుక అతనికి రబ్బాన్ (రబ్బీ కంటే యింకా ఎక్కువ గౌరవార్థకమైన బిరుదై యున్నది) అను బిరుదు అన్వయింపబడినది. టాల్మూడ్ కాలములో ఒక విద్యార్థి వానికి ఉపదేశముచేయువానిని రబ్బీ అని సంబోధింపవలెనని కోరబడి యుండెను.[13]

**వచనము 8.** వారు తోటి విశ్వాసుల నడుమ బిరుదు **బోధకుడు** అను నామమును వెదకుచు, తమ్మునుతాము హెచ్చించుచొనకూడదని యేసు తన శిష్యులను హెచ్చరించాడు. యూదా మతములో, ఒకడు అధిగమించుచు వెళ్లవలసి యుండిన నానావిధ శిష్యత్వ స్థాయిలుండినవి, గనుక ఒక విద్యార్థి చివరకు తన క్రింద కొందరు శిష్యులు గల ఒక బోధకుడు కావలెననునది వాని అంతిమ లక్ష్యమై యుండినది.[14] ఏది ఏమైనా, యేసును వెంబడించుచుండినవారు తీవ్రమైన వ్యక్తిగత అభ్యుదయేచ్ఛలతో ఆయనను వెంబడించకూడదు.

సంఘములో ఉపదేశకులు వహించు పాత్రను మన ప్రభువైన యేసు క్రీస్తు ఏమాత్రమును తక్కువగా అంచనావేయలేదు (అపొస్తలుల కార్యములు 13:1; 1 కొరింథీయులకు 12:28; ఎఫెసీయులకు 4:11; 1 తిమోతి 2:7; 3:2; 2 తిమోతి 1:11; హెబ్రీయులకు 5:12). దానికి మారుగా, తన శిష్యులు వినయమనస్కులై ఆయన యొక్క సార్వభౌమాధికారమును గుర్తించవలెనని ఆయన పిలుపునిచ్చుచుండెను. అగ్రపీఠమును అధిగమించిన ఉన్నతమైన స్థానములో ఉన్న ఉపదేశకుడను అవగాహన చొప్పున, యేసు మాత్రమే ఏకైక నిజమైన **ఉపదేశకుడై** యున్నాడు. సత్యము ఆయనలో నుండి మాత్రమే నిర్గమించుచున్నది. ఇతర ఉపదేశకులు కేవలము ఆయన బోధించిన విషయముల గూర్చి వారికున్న తెలివిని పంచుకొనుచుందురు (28:18–20; యోహాను 14:26; 16:12–15).

మతోపదేశకులు ప్రయోగించు బిరుదులకు ఒకే ఒక సామాన్య ఉద్దేశమున్నది: ఆ బిరుదులను ధరించి యుండు వ్యక్తులను హెచ్చించుట. యేసు క్రైస్తవ **సహోదరుల** నడుమ గల జనసామాన్యమును నొక్కివక్కాణించాడు (చూడు 12:48-50; గలతీయులకు 3:28) దేవుని రాజ్యములోపల యజమానులు లేరు; దాని పౌరులందరును పరిచారముచేయు దాసులే (20:25-28). సంఘములో గొప్పతనమునకు తీసికొని వెళ్లు మార్గము, సేవ లేక పరిచారము. తనను తాను హెచ్చించుకొనుటకు ప్రయత్నించువారెవరైనను తగ్గింపబడుదురు, పరిచారము చేయుటకు తనను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును. దేవుడు మనలను ఎలా మదింపు చేస్తాడన్నదే అసలు విషయమై యున్నది.

**వచనము 9.** ఒక మత నాయకుడిని **తండ్రి** యని పిలుచుటను యేసు ఖండించాడు. ఈ అభ్యాసము దీర్ఘకాలిక సాంప్రదాయమై యున్నది. న్యాయాధిపతులు కాలములో సహితము, లేవీయ వంశమునకు సంబంధించిన యాజకుడు తండ్రిగా పరిగణింపబడినాడు (న్యాయాధిపతులు 17:10) విశ్వాసపాత్రుడైన తన సలహాదారుడు, ఏలీయాను "నా తండ్రీ" అని ఎలీషా సంబోధించాడు (2 రాజులు 2:12). ఇశ్రాయేలీయుల నేలుచుండిన రాజులు ఎలీషాను ఇదే విధముగా సంబోధించారు (2 రాజులు 6:21; 13:14). యూదా మతోపదేశకుల కాలములో, "తండ్రి" అను నియమిత బిరుదు ప్రముఖులైన యూదా మత బోధకులకు మర్యాద ఇచ్చుటకు వాడబడినది.[15]

యేసు ఇహలోక తండ్రుల నుద్దేశించి వారికి నియమింపబడిన బిరుదును ఖండించలేదు (15:4; 19:19; ఎఫెసీయులకు 6:2; కొలొస్సయులకు 3:21; హెబ్రీయులకు 12:9). ఆయన సువార్త ద్వారా కనిన వారి విషయంలో పౌలు, తనను తాను వారికి ఒక తండ్రిగా ఎంచుకొన్నాడు (1 కొరింథీయులకు 4:15; 1 తిమోతి 1:2; 2 తిమోతి 1:2; తీతుకు 1:4). మార్కుతో, తన అక్కున చేర్చుకొన్న వానితో తనకుండిన సంబంధమును, పేతురు ఇదే దృక్పథముతో దృష్టించాడు (1 పేతురు 5:13). ఇటువంటి సహోదరులను యోహాను "నా చిన్న పిల్లలు" మరియు "చిన్న పిల్లలు" అని సంబోధించాడు (1 యోహాను 2:1, 12, 18, 28; 3:7, 18; 4:4; 5:21). అయితే ఈ విధంగా ప్రేరేపింపబడిన వీరెవ్వరైనను వారు "తండ్రి" యని సంబోధింపబడవలెనని ఎన్నడైనను పట్టుబట్టలేదు. ఆధ్యాత్మిక **తండ్రి** ఒక్కడే ఉన్నాడు, ఆయనే "పరలోకమందున మన తండ్రి" (6:9; చూడు 5:48; 6:14, 26, 32; 15:13; 18:35).

**వచనము 10.** 8వ వచనంలోగల మనోభావాలు వచనము 10లో పునరావృతమగుచున్నవి. **గురువు** (నాయకుడు) (*kathēgētēs*) అని అర్థమిచ్చు గ్రీకు పదము క్రొత్త నిబంధనలో ఒక్క సారే ప్రయోగింపబడినది. ఈ పదము "యజమానుడు" (KJV), "ఉపదేశకుడు" (NKJV), మరియు "ఆదేశకుడు" (NRSV) అని నానావిధములుగా అనువదింపబడినది. "బోధకుడు" (*didasklos*) అను పదమునకు ఇదొక సమీప పర్యాయపదమై యున్నది. "గురువు" అను పదము **క్రీస్తునకు** మాత్రమే చెందిన ఒక బిరుదై యున్నది. ఆయన ఒక్కడే ఆధ్యాత్మిక గురువై యున్నాడు గనుక ఆయన బోధలు అనుకరింపబడవలెను. సహజంగానే, ఇతరులు ఆయన వాక్యోపదేశకులై యుండగలరు.

8 మొదలుకొని 10వ వచనము వరకు, మానవులు కొందరిని ఇతరుల కంటె ఉన్నత స్థానములోనికి హెచ్చించుటకుగల ఉన్ముఖతను యేసు వ్యతిరేకించుచుండెను.

తన సంఘములో అధికార పరంపర అభివృద్ధి చెందుటను ఆయన వ్యతిరేకించాడు. సంఘమునకు యేసు శిరస్సుగాను, దేవుడు తండ్రిగాను గల అధికార క్రమము మాత్రమే సంఘములో స్థాపింపబడవలసిన అధికార పరంపరయై యున్నది.[16]

**వచనములు 11, 12. మీలో అందరి కంటె గొప్పవాడు మీకు పరిచారకుడై యుండవలెను. తన్ను తాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడును; తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును** అని చెప్పుచు యేసు ఈ విభాగమును ముగించాడు. వారు స్వప్రయోజనమును విచారించుచుండిన పరిసయ్యులను, ప్రజల మెప్పును సంపాదించుకొనుటకు తమ్మునుతాము తరుచుగా హెచ్చించుకొనుచుండిన నాయకులను, అనుకరించకూడదని ఈ మాటలు ప్రజలను హెచ్చరించినవి. 11వ వచనంలోని భాష అంతకు మునుపు 20:26లో గల భాష వలెనే యున్నది: "మీలో అందరి కంటె గొప్పవాడు మీకు పరిచారికుడై యుండవలెను." 12వ వచనము యొక్క ప్రధానాంశము లేఖనములలో తరచుగా అగుపించును (సామెతలు 29:23; లూకా 14:11; 18:14; ఫిలిప్పీయులకు 2:6–9; యాకోబు 4:6; 1 పేతురు 5:5, 6). టాల్మూడ్‌లోని తరువాతి రచనలు ఈ ప్రధానాంశమును పునఃరావృతము గావించుచున్నవి: "పరిశుద్ధుడైన వాని యెదుట తన్నుతాను తగ్గించుకొనువాడు, వాడు ధన్యుడు వాడు హెచ్చింపబడును, మరియు పరిశుద్ధుడైన వానిని వాడు తగ్గించుకొనువాడు హెచ్చించువాడు."[17]

✧✧✧✧✧ **పాఠములు** ✧✧✧✧✧

### నిజమైన మతము (అధ్యా. 23)

మత్తయి సువార్త 23వ అధ్యాయం తరచుగా " 'శ్రమ' అధ్యాయము"గా పిలువబడుచున్నది ఎందుకనగా, యేసు ఈ పదమును పదే పదే ప్రయోగించాడు (23:13, 14, 15, 16, 23, 25, 27, 29). "శ్రమ" అని అర్థమిచ్చునట్లు అనువదింపబడిన గ్రీకు పదము *ouai*, యూదా ప్రజల నాయకుల ఆధ్యాత్మిక దుస్థితి, మరియు తీర్పు వలన వారు ఎదుర్కొనవలసి యున్న ముప్పునుబట్టి మన ప్రభువైన యేసు క్రీస్తు అనుభవించుచుండిన దుఃఖమును సూచించుచున్నది. శాస్త్రులు మరియు పరిసయ్యులు మతసంబంధమైనవారును, అత్యంత ఆసక్తిపరులునై యుండిరి, కానీ దేవునికి అంగీకారమైన లక్షణములు వారిలో కొదువయై యుండినవి. ఈ అధ్యాయములో నుండి మనము నిజమైన భక్తి గూర్చిన ఐదు పాఠములు నేర్చుకొనగలము.

1. *ఒక చర్య నీతిమంతమైనది కాకుండానే, అది మతసంబంధమైనదై యుండవచ్చును* (23:1–12). పరిసయ్యులు మతసంబంధమైన పనులు అనేకము చేసారు, కానీ తరుచుగా అవి కేవలము మనుష్యులకు కనబడవలెనని మాత్రమే వారుద్దేశించారు. వారు తమ రక్ష రేకులను వెడల్పు గావించుకొన్నారు, చెంగుల పొడవు పెంచారు. అధికారముతో కూడిన మతోపదేశ హోదాల కొరకు మరియు తద్వారా లభించు వేతనములు, అగ్రపీఠములు మరియు పూజనీయమైన బిరుదుల కొరకు ప్రాకులాడారు. అయితే వీటన్నిటి వెనుక నుండిన ప్రోత్సాహకములు ఈ చర్యలను నిరర్థకము చేసినవి.

2. *ఒక చర్య ప్రయోజనకరమైనది కాకుండానే, అది మతసంబంధమైనదై*

*యుండవచ్చును* (23:13, 15). వాస్తవమునకు, ఇటువంటి చర్యలు హానికరమైనవై యుండవచ్చును. పరిసయ్యులు ఇతరులను వారి కోవ లోనికి మార్చుటకు ఎంతో ప్రయాసపడ్డారు. ఏది ఏమైనా, చివరకు వారికి దొరికిన ఫలితం వారి మతంలోనికి నూతనంగా చేరినవారు వారిని మార్చిన వారి కంటె మరి ఎక్కువ అవినీతిపరులయ్యారు.

3. *ఒక చర్య సంపూర్ణముగా చాలినదై యుండకుండానే, అది మతసంబంధమైనదై యుండవచ్చును* (23:23). పరిసయ్యులు అల్పమైన విషయాల్లో మాత్రమే నమ్మకమైనవారై యుండుటను యేసు ఖండించలేదు. యూదులకు, పెరట్లోని చిన్న కూర మొక్కలు మరియు వంటకాన్ని పరిమళింపజేసే వాసన దినుసులలో నుండి దశమ భాగమిచ్చుట కూడ ఎంతో మంచి పనై యుండినది. దానికి మారుగా, వారు చేయవలసియుండిన ముఖ్య విషయాలను వదిలిపెట్టి, సామాన్య విషయాలను పట్టించుకొనుట వలన ఆయన వారిని ఖండించాడు. వారు అల్పమైన విషయాలను నొక్కివక్కాణించుచు, అసలు విషయాలను: న్యాయము, కనికరము, మరియు విశ్వసనీయతను అలక్ష్యము చేసారు.

4. *ఒక చర్య మతసంబంధముగా మనఃకల్పితమైనదిగాను, ఆదర్శవంతమైనదిగాను ఉండవచ్చును కానీ అది అమలు చేయబడనట్లయితే నిష్ప్రయోజనమైనదిగానే నిలిచిపోతుంది* (23:29–36). పరిసయ్యులు, వారి పూర్వీకులు హతమార్చిన ప్రవక్తల సమాధులను సగౌరవంగా చూసారు; కానీ, వారు తమ హృదయములను మార్చుకొనలేదు. వారి కాలములో దేవుడు వారి యొద్దకు పంపినవారితో – యేసు మరియు శిష్యులతో – కూడ అమర్యాదగా ప్రవర్తించి వారిని చంపారు.

5. *తప్పులు చేస్తూనే మతసంబంధమైన చర్యలలో నిమగ్నమగువారు ఎప్పటికిని తప్పులు చేయుచున్నవారిగానే నిలిచియుండనవసరము లేదు* (23:37–39). వారు మారుమనస్సునొంది దేవునితో సఖ్యపడవచ్చును. ప్రభువైన యేసు క్రీస్తును ఎల్లకాలము తృణీకరించుట భయంకరమైన పొరపాటే, కానీ ఏ ఒక్కరైనను రక్షింపబడని స్థితిలోనే నిలిచియుండ నవసరములేదు.[18]

## పరిసయ్యులు (అధ్యా. 23)

హెల్లేనీయుల సంస్కృతి, వారి మతమును మరియు మతోపదేశములను తీవ్రముగా ప్రభావితము చేయుచుండిన సందర్భములో, యూదులు ధర్మశాస్త్రమునకు లోబడవలసిన విధానమును భద్రముగా కాపాడుకొనవలెననునది పరిసయ్యుల అసలు తాత్పర్యమై యుండినది. "పరిసయ్యులు," లేక "వేరుచేయబడినవారు" అను పేరే, పాపము నుండి వేరుచేయబడినవారను భావము నిచ్చుచుండినది. క్రొత్త నిబంధన క్రైస్తవ్యమును పునరుద్ధరించి భద్రముగా కాపాడవలెనను భావనను ఆదరంతో ఆలింగనము చేసుకొనువారు వారి ఘనమైన దర్శనమును నిశ్చయముగా సాధించగలరు. అట్లయినప్పటికిని, యేసు వారిని అనేక హేతువులనుబట్టి ఖండించాడు. మనము కూడ ఇదే విధమైన తప్పులు చేయకుండునట్లు తగు జాగ్రత వహించవలెను.

1. వారు, చెప్పిన విషయములను చేయలేదు (23:2, 3).
2. అవి దేవుడిచ్చిన ఆజ్ఞలైయున్నవన్నట్లు, వారి సాంప్రదాయములను వారు

ఇతరులపై రుద్దారు (23:4; చూడు 15:1-9).

3. వారు ఎంత సేపూ ప్రజల్లో వారికుండవలసిన పరపతి గూర్చి మాత్రమే ఆందోళన చెందారు కానీ దేవునితో కలిగియుండవలసిన సంతోషకరమైన సమాధానము మరియు సఖ్యత గూర్చి చింతించలేదు (23:5-7).
4. వారు ఇతరులను దేవుని యొద్దకు నడిపించుటకు బదులుగా, ఇతరులను వారి సొంత గూటిలోనికి చేర్చుకొన్నారు, మార్చుకొన్నారు (23:13, 15).
5. అది వారికి అనుకూలముగా ఉన్నప్పుడు మాత్రమే వారిచ్చిన మాటను నిలబెట్టుకొనవలసినవారై యున్నరని వారనుకొన్నారు (23:16-22).
6. ఆరాధన కృతులలో వారు అత్యంత అనుభవశాలులై యుండిరి కానీ "పవిత్రమును నిష్కళంకమునైన భక్తి" విషయంలో ఏమాత్రమును అనుభవంలేనివారై యుండిరి (23:23, 24; చూడు 25:34-46; యాకోబు 1:27).
7. బాహ్యముగా వారు నీతిమంతులుగా అగుపించారు కానీ అంతరంగ నవీకరణమును అనుభవించలేదు (23:25-28).
8. వారి పితరుల పాపములను వారు గ్రుడ్డిగా, అర్థరహితంగా పునరావృతము గావించుచుండిరి (23:29-36).

దేవిడ్ స్టూవర్ట్

**నేడు ప్రబలియున్న ఆధునిక పరిసయ్యుల తత్వము (23:1-12)**

పరిసయ్యుల మనస్తత్వమును అమలుచేయుటకు వ్యతిరేకముగా క్రైస్తవులు తమ్మును తాము కాపాడుకొనవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. మతమనునది అంతరంగమునకు సంబంధించిన అసలు అంశమని మర్చిపోయి, అదొక బాహ్యాచారమను భావమును కల్పించుకొనుట అతి సులభము. ఒకడు "ఆదివారం నాటి అందచందము"ను అత్యంత ఆకర్షణీయముగా చేసికొనవచ్చును కానీ దేవుని ఆరాధించు నిమిత్తము తన హృదయమునే సిద్ధపరచుకొనకపోవచ్చును. చక్కని, ఆకర్షణీయమైన దుస్తులు ధరించకుండా ఆరాధనకు సమావేశమైనవారిని అతడు అల్పమైనవారుగా దృష్టించవచ్చును (యాకోబు 2:2-4). ప్రార్థనలో నడిపించినప్పుడు, దేవునితో వినయముగా విన్నవించుకొనుటకు బదులుగా, సంఘ సభ్యుల హృదయాల్లో సొంతమును గూర్చిన సదభిప్రాయమును ముద్రవేయుటకు ఆందోళన చెందవచ్చును. సంఘారాధనల్లో నీతిమంతమైన ప్రవర్తనను ప్రదర్శింపవచ్చును కానీ వారములోని మిగిలిన రోజులన్నిటిలో తన నైతికతను దిగజారనీయవచ్చును. పరిసయ్యుని మనస్తవత్వముగలవాడు తన సొంత డబ్బా వాయించుకొనుచు తన ప్రాముఖ్యతనే చాటుకొనును. అతడొక గదిలోనికి ప్రవేశించినపుడెల్లా, ఆ గదిలో నున్న ఇతరుల అవసరములను తీర్చునట్లు ప్రయత్నించుటకు బదులుగా అందరి దృష్టిని తన వైపునకే ఆకర్షించుట వాని ప్రధాన లక్ష్యముగా పెట్టుకొనును. ప్రాథమికంగా, "మీరున్నారు కదా, చాలు!" అనుటకు బదులుగా, "నేనే ఉన్నాను కదా, గనుక నేనే చాలును" అని అతడు చెప్పుచున్నాడని అర్థము.

దేవిడ్ స్టూవర్ట్

## హెచ్చింపబడిన బిరుదులు (23:8-10)

మతమునకు సంబంధించిన అనేక గుంపులు హెచ్చింపబడిన బిరుదులు గూర్చి యేసు చెప్పిన ఉపదేశములను అలక్ష్యము చేయుచున్నవి. కథోలిక్కుల సాంప్రదాయములో, సంఘ సభ్యులు వారి నాయకులను సామాన్యముగా "ఫాదర్" (తండ్రి) అని సంబోధించుచు వారికి క్షమాపణ మధ్యవర్తిత్వ అధికారమును ఆపాదించుదురు. ఒక పేరిష్ సభ్యుడు ఒప్పుకోలు కొరకు ఆ ప్రీస్ట్ యొద్దకు వెళ్లి కొన్నిపర్యాయములు, "ఫాదర్, నన్ను క్షమించండి, ఎందుకంటే నేను పాపము చేసాను" అని పలుకును. ఈ సందర్భములో, "ఫాదర్" (తండ్రి) అను బిరుదు, దానితోపాటు ప్రీస్ట్ హోదా, ఒక కృత్రిమ అర్చకుడు - అర్చకేతరుడు అను పద్ధతిని కల్పించును, ఇది సహోదరత్వమునకు పరస్పరము విరోధముగా నున్నది (23:8). దానికి బదులుగా, వారు తప్పిదములను ఒకరితో నొకరు ఒప్పుకొనవలెననియు ఒకరి గూర్చి మరొకరు ప్రార్థించవలెననియు క్రైస్తవులు ఆజ్ఞాపింపబడి యున్నారు (యాకోబు 5:16). పాపములను క్షమించువాడు తండ్రియైన దేవుడొక్కడే.

ప్రొటెస్టంటు వారి సాంప్రదాయములో, "రెవరెండ్" అను పదము ఒక పరిచారకునికి తరచుగా అన్వయింపబడుచున్నది. "రెవరెండ్" - "పూజనీయము" అని అర్థమిచ్చు పదము పరిశుద్ధ బైబిల్ KJV భాషాంతరీకరణములో ఒక్కసారి మాత్రమే, కీర్తనలు 111:9లో కనబడుచున్నది. ఈ వచనము, దేవుని సూచిస్తూ, "ఆయన నామము పరిశుద్ధమైనది పూజింపదగినది" అని సెలవిచ్చుచున్నది. దేవుని పేరు "రెవరెండ్, ... ఫలానా, ... ఫలానా" అని చెప్పుట లేదు, కానీ ధర్మశాస్త్రములో ఆజ్ఞాపింపబడినట్టుగా (నిర్గమకాండము 20:7), ఆయన నామము పూజింపదగినది. ఇంతటి పూజనీయతకు ఏ మానవుడు యోగ్యుడు కాడు.

## బిరుదులు (23:8-10)

యేసు బిరుదులకు వ్యతిరేకముగా సూచించిన నిషేధములు మూడు నిర్దిష్టమైన విషయాలను తెలియజెప్పుచున్నవని విల్కిన్స్ సూచించుచున్నాడు:

1. *విద్యా సంబంధిత అతిశయము.* మనము ఇతరులకు సువార్తను బోధించుటకు వెదకుచుండవలెను, కానీ అసలు బోధకుడైన యేసును వంచనతో అధిగమించుటకు ఎన్నడును ప్రయత్నము చేయకూడదు (23:8).

2. *మత సంబంధముగా ఇతరుల కంటె మిన్నయైయున్నాడను అనుభూతి.* యౌవన క్రైస్తవులను మనము కాపాడవలెను మరియు పెంచిపోషించవలెను, కానీ అసలు పరలోక తండ్రియైన దేవునిని వంచనతో అధిగమించుటకు ఎన్నడును ప్రయత్నించకూడదు (23:9).

3. *అధికారతత్వవాదముతో కూడిన పెత్తనం.* ఇతరులను పరిపక్వమైన శిష్యులనుగా చేయునట్లు వారిని నడిపించుటకు మనము కోరుకొనవలెను, అయితే ఆయన సంఘమునకు యేసు మాత్రమే శిరస్సైయున్నాడని మనము జ్ఞాపకముంచుకొనవలెను (23:10).[19]

డేవిడ్ స్టూవర్ట్

సూచనలు

[1]R. T. France, *The Gospel According to Matthew,* The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1985), 323. శిష్యులు పరిసయ్యులను ప్రశంసించారను వాస్తవము, అంతకు మునుపటి ఒక సందర్భములో యేసు వారిని అభ్యంతరపరచాడని వారు ప్రదర్శించిన ఆందోళన ద్వారా స్పష్టమగుచున్నది (15:12). [2]1 Maccabees 1:20-64. [3]Ibid., 4:36-58. [4]Jerusalem Talmud *Sotah* 5.5; చూడు *Berakoth* 9.5; Talmud *Sotah* 22b. [5]Michael J. Wilkins, "Matthew," in *Zondervan Illustrated Bible Backgrounds Commentary*, vol. 1, *Matthew, Mark, Luke*, ed. Clinton E. Arnold (Grand Rapids, Mich.: Zondervan, 2002), 140. కొరాజీన మరియు డెలోస్‌లలో లభించిన పీఠముల ఫొటొగ్రాఫులను విల్కిన్స్ సమకూర్చాడు. [6]"మరియు మోయుటకు కష్టముగా నున్న" అను అదనపు పదజాలము కొన్ని చేతిరాత ప్రతులలో కలదు (చూడు KJV). నకలు వ్రాయుచుండిన శాస్త్రి యొక్క కనుచూపు దానిని దాటివేసినందువలన ఈ పదజాలము అనుకొనని రీతిలో విడిచిపెట్టబడియుండవచ్చును, లేదా అది లూకా 11:46లో నుండి తీసికొనబడిన ఇచ్చట చేర్చబడి యుండవచ్చును. (Bruce M. Metzger, *A Textual Commentary on the Greek New Testament*, 2d ed. [Stuttgart: German Bible Society, 1994], 49.) [7]Leon Morris, *The Gospel according to Matthew*, Pillar Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1992), 573. [8]నిర్గమకాండము 16:29; 23:12; 31:13–17; 35:2, 3; లేవీయకాండము 26:34, 35; సంఖ్యాకాండము 15:32–36; ద్వితీయోపదేశ కాండము 5:12–15. [9]Wilkins, 141. [10] చూడు Josephus *Antiquities* 4.8.13; *Letter of Aristeas* 159.

[11]మధ్యధరా సముద్రము చుట్టు నున్న ప్రదేశములలోని ఈ వాడుక గూర్చినవి అనేక ఉదాహరణములు Craig S. Keener, *A Commentary on the Gospel of Matthew* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1999), 542-43 లో ఉదహరించి చెప్పబడి యున్నవి. [12]William Sanford LaSor and Tamara C. Eskenazi, "Synagogue," in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmens Publishing Co., 1988), 4:680. [13]Jack P. Lewis, *The Gospel According to Matthew,* Part 2, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1976), 110; చూడు Talmud *Berakoth* 3a; *Baba Kamma* 73b. [14]Wilkins, 142. [15]చూడు Mishnah *Peah* 8.5; Talmud *Berakoth* 6a; Jerusalem Talmud *Besah* 1.7; *Genesis Rabbah* 12.14. అరమెయిక్ భాషలోని *అబ్బా* అను పదము "తండ్రి" అను అర్థమిచ్చును (రోమీయులకు 8:15). మిశ్నాలోని ఒక చిన్న ప్రబంధమునకు "తండ్రులు" అని అర్థమిచ్చు *అబోత్* అను పేరు పెట్టబడినది. అది ప్రఖ్యాత యూదా పతోపదేశకులు పలికిన జ్ఞాన సూక్తులు (సామెతలు) గల ఒక సంకలనమై యున్నది. [16]Robert H. Mounce, *Matthew,* New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 1991), 215. [17]Talmud *Erubin* 13b. [18]Jack Wilhelm *RSVP Newsletter* (1991) నుండి సానుకూలంగా పొందుపర్చబడినది. [19]Wilkins, 143.